క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు


ప్రత్యేక పూజల అనంతరం కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్ర పారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

పండ్ల దుకాణాల తనిఖీ


పండ్ల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

ఆత్మకూరు: పట్టణంలోని పండ్ల దుకాణాలను మంగళవారం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఖాశీంవలి, వెంకటరాముడు తనిఖీ చేశారు. అరటి, మామిడి తదితర పండ్లకు విషపూరిత పదార్థాలతో మాగిస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో తనిఖీలు నిర్వహించి శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ల్యాబ్‌లో పరీక్షల ఫలితాల అనంతరం యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

శక్తియాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి


శక్తి యాప్ గురించి విద్యార్థులకు తెలియజేస్తున్న పోలీసులు

ఆత్మకూరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్‌ను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పోలీసులు సూచించారు. మంగళవారం ఆదిత్య జూనియర్ కళాశాలలో ఆత్మకూరు శక్తి టీం బృందాలు శక్తి యాప్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలపై వివరించారు. ప్రస్తుతం సమాజంలో జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరిగే నేరాలు, సైబర్ నేరాలు, అత్యవసర సమయంలో ఉపయోగించాల్సిన టోల్ ఫ్రీ నంబర్ల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థిని శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

రైతులకు సమస్య లేకుండా చర్యలు

జూపాడుబంగ్లా: కేసీ కాల్వ ఆయకట్టు రైతుల పొలాలకు సాగునీరు పారేలా చర్యలు తీసుకుంటామని కేసీ కాల్వ వేల్పనూరు సెక్షన్ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆయన తూడిచెర్ల సమీపంలోని వేల్పనూరు కాల్వ 2వాగుల వద్ద ఉన్న తూమును పరిశీలించారు. తూముకు అవసరమైన షెట్టర్ ఏర్పాటు చేయడంతో పాటు దెబ్బతిన్న కాల్వ లైనింగ్ మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. రైతుల పొలాలకు సాగునీరు పారించుకునే సూపర్‌ప్యాసేజ్‌కు పడిన రంధ్రాన్ని పూడ్చిం చేసి సవ్యంగా పొలాలకు సాగునీరు పారేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రైతులు మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లుయాదవ్, సురేష్‌యాదవ్, మల్లికార్జునయాదవ్, వెంకటేశ్వర్లు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు పాఠశాలల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: కిశోర బాలికలు బడిబయట ఉండకుండా ప్రతి ఒక్కరూ పాఠశాలల్లో విద్యను అభ్యసించేలా చూడాలని ఎంపీడీఓ గోపీకృష్ణ, జిల్లా బాలబాలికల పరిరక్షణ అధికారిణి స్వప్న తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో కిశోర బాలికా వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధికారిణి స్వప్న, ఎంపీడీఓ గోపికృష్ణ, సీడీపీఓ కోటేశ్వరమ్మ, మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కిశోర బాలికలు వ్యక్తిగతంగా, శారీరక పరంగా తలెత్తే మార్పులతో పాటు వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పరిశుభ్రతను వివరించాలని అంగన్‌వాడీ వర్కర్లకు సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ మంగవల్లి, ఏపీఎం అంబమ్మ పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి

వెలుగోడు: వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా బుధవారం నిర్వంచనున్న ర్యాలీని జయప్రదం చేయాలని మైనారిటీ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మౌలానా జావాద్ అహ్మద్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పాత బస్టాండ్ మర్కస్ మసీదు నుంచి ర్యాలీ ప్రారంభమై మదిన సెంటర్ వరకు కొనసాగుతుందన్నారు. మదిన సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టి అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం చేరుకుని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తామన్నారు. కార్యక్రమంలో కో కన్వీనర్‌లు మౌలానా మహబూబ్ రహిమాన్, హిదాయత్ అలీఖాన్, ఇలియాస్ ఖాన్, రఫీ, సాబిర్ హుసేన్, వలీ, టైలర్ సయ్యద్, మొహమ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

నత్తనడకన నీటి తొట్ల నిర్మాణం

- మండలానికి 16 తొట్లు మంజూరు
- ఐదే పూర్తి.. 11 అసంపూర్తి
- నెలాఖరు గడువు విధించిన ఉన్నతాధికారులు


పాత ముచ్చుమర్రిలో క్యూరింగ్ చేయకుండా వదిలేసిన నీటి తొట్టి


నెహ్రూనగర్‌లో తక్కువ సిమెంట్ వేసి నిర్మిస్తున్న తొట్టి

పగిడ్యాల: వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి వసతి కలిగిన చేతి బోర్ల వద్ద ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన నీటి తొట్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలానికి 16 నీటి తొట్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు తీసుకున్నారు. ఒక్కొక్క తొట్టి నిర్మాణానికి రూ.35 వేల నిధులను కేటాయించినట్లు ఏపీఓ మద్దిలేటి పేర్కొన్నారు. ఈ పనులను గ్రామ సర్పంచ్‌లు, మధ్యవర్తులకు అప్పగించారు. ఈ నెలాఖరులోగా నీటి తొట్ల నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి టార్గెట్ విధించారు. 2 అడుగుల ఎత్తు, 2 మీటర్ల పొడవుతో సిమెంట్ బ్రిక్స్‌తో ప్రారంభించిన నీటి తొట్ల పనులు నత్తనడకన సాగుతుండడంపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

నాణ్యత గాలికి..

మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా నిర్మిస్తూ క్యూరింగ్‌ను విస్మరించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాణ్యతా ప్రామాణాలకు తిలోదకాలు ఇస్తూ నిర్మిస్తున్న పశువుల నీటి తొట్లు ఎంత కాలం మన్నిక వస్తాయోనని అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో లక్షలాది రూపాయలు బూడిదలో పోసిన పన్నీరులా మారనున్నాయని ఆయా గ్రామాల్లోని ప్రజలు చర్చించుకుంటున్నారు.

గతంలో 2014–2019 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం వాటర్‌షెడ్ పథకం కింద లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన నీటి తొట్లు ప్రస్తుతం మచ్చుకు ఒక్కటి కూడా కనిపించకుండా పోయాయి. అయినా కూటమి ప్రభుత్వ పాలనలో మళ్లీ పశువుల నీటి తొట్లు పురుడు పోసుకోవడం పలు విమర్శలకు తావిస్తోంది. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలంటే నిధులు లేవని నిరుపయోగంగా మారే నీటి తొట్లకు లక్షలాది రూపాయలను కూటమి ప్రభుత్వం తగలేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

16 నీటి తొట్లు మంజూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మండల వ్యాప్తంగా 16 నీటి తొట్ల పనులు ప్రారంభమయ్యాయి. ఒక్కొక్క తొట్టి నిర్మాణానికి రూ.35 వేల నిధులు కేటాయించారు. ఈనెలాఖరులోగా నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది. అయినా కేవలం 5 తొట్లు మాత్రమే పూర్తయ్యాయి. మిగతావి నిర్మాణ దశలో ఉన్నాయి.
– మద్దిలేటి, ఏపీఓ, పగిడ్యాల

మౌలిక వసతులు కల్పించాలి

నందికొట్కూరు: పూరి గుడిసెవాసులకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు కోరారు. మంగళవారం బైరెడ్డి నగర్‌లో పూరి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న ప్రజలకు మౌలి వసతులు కల్పించాలంటూ వార్డు సచివాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఆయన 589, 590, 595 సర్వే నెంబరులో పూరి గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. రోడ్లు, విద్యుత్, మంచినీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బంది పుడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలయ్య, షాజిదాబి, స్థానికులు రాజు, ప్రసాద్, సుబ్బమ్మ, లోకేష్, విజయ్, దాసు, నాగశేషమ్మ పాల్గొన్నారు.

కిశోర వికాసంపై శిక్షణ

కొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు, ఆశా వర్కర్లు, పొదుపు వీఓఏలకు, సచివాలయం సిబ్బందికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమంపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. కొత్తపల్లి వైద్యురాలు దీపా నాగవేణి మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్లలోపు బాల, బాలికలకు పౌష్టికాహారం తీసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వివాహ వయస్సు, వారి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన విషయాలపై వివరించారు.

శనగల బసవన్నకు పూజలు


పూజలందుకున్న బసవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో వెలసి శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడు వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానబెట్టిన శనగలను క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యంగా సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

యువకుడిపై కేసు నమోదు

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పగిడ్యాల దేవనగర్ కాలనీకి చెందిన ఓ యువకునిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. కాలనీకి చెందిన అడ్డాకుల శివకుమార్ ఇదే కాలనీకి చెందిన దాసరి సామేలు అనే వ్యక్తి పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడుతూ చేతిలోని నూనే కేన్‌తో తలపై మోది గాయపరిచాడని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ తెలిపారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు: వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కె.దినేష్‌కుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు సాయిప్రశాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్‌లో వారు మాట్లాడుతూ కొన్ని ప్రయివేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వేసవి కాలంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాయన్నారు. తనిఖీలు నిర్వహించి అలాంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలన్నారు.సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీబాబు, దిలీప్, అంజి పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆలయ, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు

ఆత్మకూరు: మండలంలోని నల్లకాల్వ గ్రామంలో మే 1 నుంచి 3వ తేదీ వరకు సీతారామాంజనేయ, లక్ష్మణసహిత, శ్రీదేవిభూదేవి సహిత చెన్నకేశ్వరస్వామి, గణపతి ఆలయాల, ధ్వజ ప్రతిష్ఠోత్సవా లు నిర్వహించనున్నట్లు ఆలయ, గ్రామ కమిటీల సభ్యులు మంగళవారం తెలిపారు. మే 1న ఉదయం గురుప్రసాద గోపూజ, గణపతి పూజ, కంకణధారణ, పంచగవ్యం, యాగశాల శుద్ధి, ఆలయ శుద్ధి, అగ్ని ప్రతిష్ట, దీక్షాహోమం, ప్రధాన దేవత ఆవాహన, గణపతి హోమం, తీర్థ ప్రసాదాలు, ప్రతిరోజూ సాయంత్రం పునఃపూజ, దీక్షాహోమం, అంకురార్పణ, జలాధివాసం, హారతి తదితర పూజా కార్యక్రమాలను చేపడతామన్నారు. 3న యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, జీవమాతృకాన్యసములు, మహా బలిదానం, దక్షద్వాల, మహాపూర్ణాహుతి, స్వామి, అమ్మవార్లకు కళ్యాణం, తీర్థ ప్రసాదాలు ఉంటాయన్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం ఉదయం 7.45 గంటలకు చేపడతామన్నారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. మే 1 నుంచి 3వ తేదీ వరకు అన్నదాన కార్యక్రమాలు చేపడతామన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలి

పాములపాడు: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలని సీడీపీఓ కోటేశ్వరమ్మ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 2 నుంచి నుంచి కిశోర వికాసం గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. 11 నుంచి 18 ఏళ్లలోపు బాలికలకు చిన్నతనంలో వివాహం, ఆత్మరక్షణ, చదువు గురించి తెలియజేయాలని వివరించారు. ఇందుకు గానూ జీఎంఎంకేఎస్, వీఓఏ, ఆశ, ఏఎన్ఎంలతో కలిసి కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ కమిటీ ద్వారా విషయాలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏసీడీపీఓ కల్పవల్లి పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: మున్సిపల్ పరిధిలోని ప్రజలకు వేసవి కాలంలో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జైకిసాన్ పార్కులో చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వేసవి కాలంలో పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నందికొట్కూరు పట్టణాన్ని సుందరవనంగా తీర్చిదిద్దుతామన్నారు. కర్నూలు రోడ్డు మార్కెట్ యార్డు నుంచి ఆత్మకూరు రోడ్డు జమ్మి చెట్టు వరకు డివైడర్ నిర్మాణం పూర్తి చేసి సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బేబి, తహసీల్దార్ శ్రీనివాసులు, టీపీఓ రంగస్వామి, డీఈ నాసీర్, ఆర్వో మధుసూదన్‌బాబు, వైస్ చైర్మన్ రబ్బానీ, కౌన్సిలర్లు మంగళి కృష్ణ, నాయబ్, సురేష్, విద్యుత్ శాఖ ఏఈ రాములునాయక్, మెప్మా సీఎంఎం శాంతకుమారి పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు


వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ మేనేజర్ నారాయణస్వామి

నందికొట్కూరు: బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తునట్లు కర్నూలు రూరల్ డివిజన్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నారాయణస్వామి తెలిపారు. మంగళవారం పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో బీఎస్ఎన్ఎల్ రోడ్ షో ఏర్పాటు చేశారు. వినియోగదారులకు ఆయన అవగాహన కల్పించారు. ఏప్రిల్ మాసంలో కనెక్టింగ్ విత్ కేర్ నినాదంతో ప్రజల వద్దకు సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ టెలికాం రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌ను మరింత చేరువ చేసే ఉద్దేశంతోనే కస్టమర్ సర్వీసు క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజినీర్ సుదీర్‌బాబు, జెటిఓ బుజ్జయ్య, మార్కెటింగ్ సబ్ డివిజనల్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి రోకియాబీ ఉత్సవాలు


ఉత్సవాలకు సిద్ధమైన దర్గా

వెలుగోడు: స్థానిక రోకియాబీబీ దర్గా ఉరుసు ఉత్సవాలు మే 1నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే నిర్వాహకులు దర్గా పరిసరాలను ముస్తాబు చేశారు. మే 1న రాత్రి 11 గంటలకు దర్గా నిర్వాహకుల ఇంటి నుంచి గంధం ఊరేగింపు, 2న ఉరుసు ఉంటుందని దర్గా ముతవల్లి ఖాదర్ వలీ తెలిపారు. దర్గా డెకరేషన్‌కు సర్పంచ్ వేల్పుల జయపాల్, మాజీ సర్పంచ్ ఎం అబ్దుల్ కలాం, బియ్యం రసూల్, బియ్యం ముర్తుజా అండ్ బ్రదర్స్, డాక్టర్ జాకీర్ హుస్సేన్, బీడవలి, అన్వర్ సహకారం అందించినట్లు తెలిపారు. ఉరుసు రోజున హిదాయతే గుల్షన్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు గఫరుల్లా షాఖాద్రి కుమారులు జబ్రుల్లా షాఖాద్రి,జహీర్ అలీ, సర్దార్, రియాజ్, సలీం సహకారంతో అన్నదానం ఉంటుందన్నారు. అలాగే అదే రోజు ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి బండలాగు పోటీలు, 11 గంటల నుంచి గుండు, బరువులు ఎత్తే పోటీలు బండి లాగు పోటీలు ఉంటాయన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి

కొత్తపల్లి: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తామని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జానాల గూడెంలో నూతన విద్యుత్ లైన్ నుంచి గ్రామానికి విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు ఆమె మాట్లాడుతూ ఇకపై సిద్ధేశ్వరం, జానాల గూడెం, బలపాలతిప్ప గ్రామాల గిరిజనులు, ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు తలెత్తవన్నారు. గిరిజన పిల్లలను మంచిగా చదివించాలన్నారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి మండలంలో ఏకలవ్య మోడల్ స్కూల్ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం సంగమేశ్వరాలయం, కొలనుభారతీ క్షేత్రాలను సందర్శించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు బాల ఎల్లయ్య, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ మబీనా బేగం, విద్యుత్ ఎస్ఈ సుధాకర్‌రావు, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్ రెడ్డి, విద్యుత్ డీఈ జయశంకర్, ఏడీఏ రామసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ దాసరి మేరీ పాల్గొన్నారు.

లస్కర్‌పై చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: విధులకు గైర్హాజరవుతూ రాజకీయం చేస్తున్న లష్కర్ లక్ష్మన్నగౌడుపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కోసిక తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని తాటిపాడు గ్రామానికి చెందిన లక్ష్మన్నగౌడు వేల్పనూరు సెక్షన్ కాల్వ లష్కర్‌గా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈయన లష్కర్ విధులకు గైర్హాజరవుతూ గ్రామంలో టీడీపీ నాయకునిగా చెలామణి అవుతున్నారన్నారు. ఏఈ వెంకటేశ్వర్లు వేల్పనూరు సెక్షన్ కాల్వను పరిశీలించటానికి వచ్చిన సమయంలోనూ లష్కర్ విధుల్లో లేరన్నారు. మండల కేంద్రంలోని ఉపాధిహామీ కార్యాలయంలో ఏపీడీ అన్వరాబేగంతోనూ లక్ష్మన్నగౌడు రాజకీయ నేతలా వ్యవహరిస్తూ తక్కువ కొలతలకు పనులు చేసి ఎక్కువ వేతనం తీసుకుంటున్నారని ఉపాధి కూలీలపై ఫిర్యాదు చేయడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. లస్కర్ ఉద్యోగం మానేసి రాజకీయ నేతగా మారాలని హితవు పలికారు. కాగా లష్కర్ గైర్హాజర్ విషయమై ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విధులకు హాజరయ్యాడని, తన పర్మిషన్ తీసుకుని పొలం వద్ద పనులు ఉండటంతో వెళ్లాడని చెప్పడం, పొలం వద్ద పంటకాల్వ బాగుచేయించుకునేందుకు ఉపాధి పనులు పెట్టాలని ఏపీడీని కోరేందుకు ఉపాధి కార్యాలయానికి వెళ్లాడని చెప్పడం గమనార్హం.

యువకుడి ఆత్మహత్య


నాగార్జున రెడ్డి(ఫైల్)

కొత్తపల్లి: మండలంలోని జి.వీరాపురం గ్రామానికి చెందిన బోగోలు నాగార్జున రెడ్డి(35) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. నాగార్జున రెడ్డి హైదరాబాదులో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యులకు చూపించినా నయం కాకపోవడంతోపాటు పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో కుంగుబాటుకు లోనయ్యాడు. ఈక్రమంలో ఇటీవల వీరాపురం వచ్చి మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 'నాచావుకు కర్త అంటే దేవుడు, కర్మ అంటే దరిద్రం, క్రియ అంటే నా తలరాత కారణం' అని సూసైడ్ నోట్ రాసి ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. తల్లిదండ్రులు గమనించి ఉరి నుంచి తప్పించి చూడగా అప్పటికే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు తండ్రి బోగోలు నాగేశ్వర రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రవీంద్రబాబు తెలిపారు.

అబ్బీపురంలో నేడు పెద్దమ్మ జాతర

- పదేళ్ల తర్వాత ఉత్సవం


పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న గ్రామస్తులు


ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ

మహానంది: మండల పరిధిలోని అబ్బీపురం గ్రామంలో బుధవారం పెద్దమ్మ దేవరకు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే బంధుమిత్రులతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యుద్దీపాలంకరణతో వీధులు ఆకట్టుకుంటున్నాయి. గ్రామంలో 1965, 2015లో పెద్దమ్మ దేవర నిర్వహించారు. పదేళ్ల తర్వాత జాతర నిర్వహిస్తుండటంతో గ్రామస్తులంతా తమ ఆడబిడ్డలను ఇప్పటికే ఇళ్లకు పిలిపించుకున్నారు.

పలు రంగాల వారికి ఉపాధి

పెద్దమ్మ జాతర సందర్భంగా పలువురికి ఉపాధి లభిస్తోంది. సప్లయర్స్ షాపులు, విద్యుత్ దీపాలంకరణ, వంటల వారికి, నాయిబ్రాహ్మణులు, తప్పెట కళాకారులు, మంచినీటి సరఫరా, కూల్‌డ్రింక్స్, హోటల్, షాపులు, బొమ్మల, గాజుల అంగళ్ల తదితర వారికి ఉపాధి లభించనుంది. ఇప్పటికే ఆయా రంగాల వారు పనుల్లో నిమగ్నమయ్యారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

పెద్దమ్మ జాతర సందర్భంగా అబ్బీపురంలో ప్రత్యేక పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశాం. 20 మంది పోలీసులు బందోబస్తులో ఉంటారు. గ్రామంలో ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు. – రామ్మోహన్‌రెడ్డి, ఎస్ఐ, మహానంది

కొలతల ప్రకారం పనులు చేయండి

జూపాడుబంగ్లా: నిర్దేశిత కొలతల ప్రకారంగా ఉపాధి శ్రామికులు పనులు చేసి గరిష్టవేతనం పొందాలని ఏపీడీ అన్వరాబేగం తెలిపారు. మంగళవారం ఆమె మండలంలోని తాటిపాడు గ్రామంలో ఉపాధి పనులు పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఉదయం ఎన్నిగంటలకు పనులకు వెళ్తున్నారు, రోజుకు ఎంత కూలీ పడుతుందని అడిగి తెలుసుకున్నారు. వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం 6 గంటలకు పనుల్లోకి వెళ్లి 10గంటల్లోగా ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. పనుల వద్దకు తాగునీరు తప్పనిసరిగా తీసుకెళ్లాలన్నారు. నిర్దేశిత కొలతల ప్రకారంగా పనులు చేస్తే రోజుకు గరిష్ఠంగా రూ.300ల కూలీగిట్టుబాటు అవుతుందన్నారు. టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు ఉపాధి కూలీలకు ఎంత పనులు చేస్తే ఎంత కూలీగిట్టుబాటు అవుతుందో తెలియజేసి వారితో పనులు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంటు లింగన్న పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాయొద్దు


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామమూర్తి

నందికొట్కూరు: కార్మికుల హక్కులను కాలరాయొద్దని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామమూర్తి కోరారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన ఆటో యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మే డేను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించడం దారుణమన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించి సాధించుకున్న కార్మిక హక్కులను కాపాడుకోవాలన్నారు. ఆటో కార్మికులకు కేంద్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మిక రంగాన్ని కాపాడాలన్నారు. 50 ఏళ్లకు పైబడిన ఆటో కార్మికులకు సామాజిక పింఛన్ రూ. 6 వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. మే డే కార్యక్రమంలో ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు సురేష్, శివ, శేఖర్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, జిలాని, నాగేంద్ర పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి ఎ.రణదీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్‌లో పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పేదలకు రెండు సెంట్ల చొప్పున స్థలం ఇచ్చి నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించాలన్నారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళనకు దిగుతామన్నారు. సమావేశంలో సీపీఎం పట్టణ నాయకులు వీరన్న, డి.రామ్‌నాయక్, ఎ.సురేంద్ర, షేక్ ఇస్మాయిల్, జి.నాగేశ్వరరావు, జబీవుల్లా, భాస్కర్, సద్దాంహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు

- అధికారులతో జిల్లా కలెక్టర్ రాజకుమారి


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

గోస్పాడు: మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించి వారి ఆర్థిక స్వాలంబనకు తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి మెప్మా, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 2025–26 ఆర్థిక సంవత్సర మహిళల వ్యవస్థాపకత కార్యాచరణ ప్రణాళికపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో విధాలుగా చేయూత నిస్తోందన్నారు. జిల్లాలో హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్, ఫుడ్ సర్వీసెస్, రెంటల్ షాప్స్, సర్వీస్ సెక్టార్ కింద 334 యూనిట్లు ఏర్పాటు చేసే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఇందులో జిల్లాకు కేటాయించిన 1,747 యూనిట్లను నెలకొల్పేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్వయం సహాయ సంఘాల మహిళల ఉత్పత్తులను ఎప్పటికప్పుడు ఓఎన్‌డీసీ సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. నంద్యాల జిల్లా అంటే ఒక ప్రత్యేక గుర్తింపు ఉండే విధంగా ఉత్పత్తులను తయారు చేసేలా మహిళలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఓఎన్‌డీసీ సైట్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలు విక్రయించే 961 ఉత్పత్తులను కలెక్టర్ ఆన్‌లైన్‌లో పరిశీలించారు. సమావేశంలో మెప్మా పీడీ నాగశివలీల, పరిశ్రమల శాఖ జీఎం జవహర్ బాబు, మున్సిపల్ కమీషనర్లు తదితరులు పాల్గొన్నారు.